www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 07 జులై 2023

1

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీసీఎఫ్ కవ్వాల్ టైగర్ రిజర్వు డైరెక్టర్ సీటీ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లోడ్‌పెల్లి, గుండపెల్లి గ్రామ శివారులో గల సహజ సిద్ధమైన అటవులను ఎఫ్‌బీఓ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు చెక్‌డ్యాంలను, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకొనే చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారులు వేణుగోపాల్, దయాకర్, పూర్ణచందర్, చంద్రమౌళి, డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, రమాదేవి, బీట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కోటపల్లి



మండలంలోని బొప్పారం, కోటపల్లి, సర్వాయిపేట, పారుపల్లి, గ్రామ పంచాయితీలలో 20 లక్షలతో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గురువారం మంచిర్యాల జిల్లా జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎంపీపీ మంత్రి సురేఖ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి గ్రామపంచాయతీలు పట్టు కొమ్మలు అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి పరిపాలన భవనం అవసరమని ఆలోచనతో భవన నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. గత ప్రభుత్వాలు గ్రామపంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ పరిపాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని పల్లెలు పట్టణాలను తలపిస్తున్నాయని అన్నారు.

సింగరేణి ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యానికి ఒప్పందం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రమాద బీమా సౌకర్యానికి ఒప్పందం చేసుకున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా కార్పొరేట్ శాలరీ ఖాతా కలిగిన ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తింప చేసే విధంగా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. దీనిలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో జీతపు ఖాతా కలిగిన ఉద్యోగులు తమ ఖాతాను యూనియన్ సూపర్ శాలరీ అకౌంట్ స్కీం కింద మార్చుకున్నట్లయితే రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు అదనపు ప్రయోజనాలు వర్తింపజేసే విధంగా సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేస్తుందని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు వారి జీతం ఖాతాలను వారి వారి బ్రాంచ్‌లో సంప్రదించి యూనియన్ సూపర్ అకౌంట్‌గా మార్చుకోవాల్సిందిగా కోరారు. దీని ద్వారా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారికి ప్రమాద బీమా సౌకర్యంతో పాటు అదనపు ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హైకోర్టు తీర్పు మేరకు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్కె-1ఏ గనిపై కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆ గని ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం టీబీజీకేఎస్ యూనియన్‌లు హైకోర్టుకి వెళ్లి సింగరేణి ఎన్నికలు వాయిదా వేయించి వారి నిజస్వరూపాన్ని బట్టబయలు చేశారని అన్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌ఎల్ సీ, సీఎల్‌సీలు ఈ విషయంలో స్పందించి సింగరేణిలో వెంటనే ఎన్నికలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపి ఏఐటీయూసీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ గోవిందుల రమేష్, ఫిట్ వైస్ ప్రెసిడెంట్ గాజుల రాయమల్లు, ఫిట్ కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య, చెంద్రకాని రమేష్, గోత్త గిరిప్రసాద్, ఏలూరి శ్రీనివాస్, కొంక మహేష్, సింగతి సురేందర్, నల్లగొని నరేష్, బండి కనకయ్య, పిడుగు మహేందర్, కోడూరి చిరంజీవి, మెరుగు శ్రీనివాస్, కామెర కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న వారికి ఘన సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్న మస్కే బాబురావు, శోభారాణిలకు గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా కాంగ్రెస్, బీజేపీ పాలనలో రైతులు బానిసలుగా ఉన్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తే రైతు ప్రభుత్వం వచ్చినట్లేనని తెలిపారు. అందుకే చంద్రపూర్ జిల్లా రాజురా నుండి హైదరాబాద్ ప్రగతి భవన్ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, కౌన్సిలర్ వంగ తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు జనార్ధన్, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మెలో జీపీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కెరమెరి

రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమస్యల సాధన కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. జీఓ నంబర్ 51ప్రకారం మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జీఓ 212, 112లను సవరించాలని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.25 వేలు చెల్లించి, జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. కార్మికుల ధర్నాకు సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్ రావు మద్దతు పలికారు. ఈ ధర్నాలో జీపీ కార్మికులు రాందాస్, రామిల్ల నరేష్, తిరుసుల్ల సంతోష్, శ్రీనివాస్, నగేష్, మల్లేష్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిరవదిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్లు ఉపాసి శ్రీనివాస్, గణపురం శ్రీకాంత్, సత్యం, సిరిపురం చంద్రశేఖర్, సంజీవ్, నారాయణ, దుర్గేశ్, గోపాల్ పాల్గొన్నారు.

పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇంటికి పంపొద్దు



నవతెలంగాణ-బెజ్జూర్

ఆశ్రమ పాఠశాలలను కొనసాగించాలని, విద్యార్థులను ఇంటికి పంపొద్దని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. గురువారం మండలంలోని కుంటాల, మానెపెల్లి, సలుగుపెల్లి, బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీఓ ఆకాస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇంటికి పంపొద్దని, త్వరలో ఆశ్రమ పాఠశాలకు నిత్యవసర వస్తువులు అందజేస్తామన్నారు. ఆయా పాఠశాలల ప్రధాన పాధ్యాయులు పాఠశాలలను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు పప్పు అన్నంతోనైనా పాఠశాలలను కొనసాగించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరామ్ ఉన్నారు.

పోడుకు హక్కులు..తీరిన చిక్కులు..!

గిరిజనుల ఏండ్ల పోరాటానికి పరిష్కారం లభించింది. వారి జీవనాధారమైన పోడు భూములకు హక్కుపత్రాలు లభిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది లబ్ధిదారులకు అందించగా.. మరో రెండు, మూడు రోజుల్లో హక్కుపత్రాల పంపిణీ పూర్తికానుంది. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు హక్కుపత్రాలు అందజేస్తున్నారు. పోడు పట్టా అందుకున్న గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ పత్రం కోసం అనేక ఏండ్ల నుంచి ఎదురుచూశామని ..తాజాగా ఆ కల నెరవేరబోతుండటం చాలా సంతోషంగా ఉందని చెబుతున్నారు.ఈ హక్కుపత్రాలు పొందిన వారికి ఈ దఫా రైతుబంధు డబ్బులు కూడా వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ఈ పత్రాలు పొందిన వారి నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా సంఖ్యలు సేకరించి రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పత్రాల పంపిణీ
- ఏండ్ల పోరాటానికి లభించిన పరిష్కారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజన లబ్ధిదారులు
- రైతుబంధు కోసం వివరాలు సేకరిస్తున్న అధికారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, బేల

అటవీ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం హక్కుపత్రాలు అందజేస్తోంది. ఈ పత్రాల పంపిణీతో గిరిజన లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పత్రాల పంపిణీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిలాల్లో 37,401 మంది లబ్దిదారులకు గాను 1,03,896 ఎకరాల కోసం హక్కుపత్రాలు అందించనున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 31,683 ఎకరాలకు గాను 12,222మందికి పట్టాలు జారీ చేస్తుండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 47,138 ఎకరాలకు 15,519మందికి, నిర్మల్ జిల్లాలో 20,051 ఎకరాలకు గాను 7257 మందికి, మంచిర్యాల జిల్లాలో 5024 ఎకరాలకు 2403మందికి హక్కుపత్రాలు జారీ చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్దిదారులకు అందజేస్తున్నారు.

ఏండ్ల పోరాటానికి పరిష్కారం

అనేక ఏండ్ల నుంచి పోడు భూమిని సాగు చేసుకుంటున్న జీవనం సాగిస్తున్న గిరిజనులు వాటికి పట్టాలు అందించాలని పోరాటం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అటవీ అధికారులు, పోడు గిరిజనులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. ప్రభుత్వపరంగా దక్కాల్సిన ఏ ప్రయోజనం రాకపోవడంతో లబ్ధిదారుల్లో మరింత నిరుత్సాహం కనిపించింది. ఈ వివాదానికి తెరదించడంతో పాటు పోడుపై ఆధారపడిన వారికి హక్కుపత్రాలు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో జూన్ 30న హక్కుపత్రాల పంపిణీ ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా పత్రాల పంపిణీ కొనసాగుతోంది. తాజాగా హక్కుపత్రాలు పొందిన వారు ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు పొందేందుకు అర్హులవుతారు. బ్యాంకు రుణాలు, రైతుబంధు, రైతుబీమాతో పాటు విత్తనాలు, ఎరువులు, విత్తనాలు తదితర వాటికి సులువుగా కొనుగోలు చేయడం.. పంట ఉత్పత్తులు విక్రయించడానికి మార్గం సుగమం కావడంతో పాటు మిగితా రైతుల మాదిరిగానే ప్రభుత్వపరంగా దక్కాల్సిన అన్ని ప్రయోనాలు వీరికి కూడా అందనున్నాయి.



హక్కుపత్రం రావడం సంతోషంగా ఉంది



మెస్రం జంగుబాయి, గర్కగూడ, బేల మండలం

అనేక ఏండ్ల నుంచి పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఈ భూమికి పట్టా అందజేయాలని అనేక ఏండ్ల నుంచి ఎదురుచూశాం. ఇప్పటికైనా హక్కుపత్రం రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం పట్టాదారులకు అందించే సదుపాయాలు మాకు కూడా లభిస్తుండటం ఆనందంగా ఉంది.

సింగరేణి కార్మికుల ఆదాయపన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఆర్‌పీ-3,3ఏ గనిలో ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాధించుకోవడంలో సకల జనుల సమ్మె చేసి కార్మికులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. సింగరేణిలో పనిచేసే కార్మికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనిక్లా పనిచేస్తున్నారని, అలాగే సింగరేణిలో వచ్చిన టర్న్ అవర్ నుంచి పన్నుల రూపేనా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వేలకోట్ల చెల్లిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి నిధులతో ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కర్చుచేస్తున్నారని అన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వమే ఆదాయ పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న బొగ్గు గని కార్మికుల భవిష్యనిధి పారదర్శకంగా ఉండాలని, ప్రతి కార్మికుడు తన ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు చూసుకునే విధంగా డిజిటల్ ఆన్ లైన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని చేసిన విజ్ఞప్తిని, మెరుగైన సేవలు అందించుటకు బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కోల్ సెక్రెటరీ అమృతలాల్ మీనా, సీఎంపిఎఫ్ కమిషనర్ డిజిటల్ ఆన్ లైన్ సిస్టం ద్వారా భవిష్యనిధిని చూసుకునే విధంగా మెరుగైన సేవలు చేశారని పేర్కొన్నారు. ఇది కేవలం బీఎంఎస్ కృషి ఫలితంగానే సాధ్యమైందని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంస్థ పరంగా వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటాను జాప్యం చేయకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం బిఎంఎస్ చేస్తున్న పోరాటానికి ఆకర్షితులైన కార్మికులను కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో నాయకులు బొంపల్లి రమేష్, కాంపల్లి తిరుపతి, పాగిడి శ్రీకాంత్, హసన్ షరీఫ్, బోడకుంట శ్రీధర్, కాసవేన సంపత్, మంద కమలాకర్, నీరటి శ్రవణ్, బుర్ర అరుణ్ కుమార్‌గౌడ్, ఎర్రవెల్లి రమేష్, పవన్ రాయుడు పాల్గొన్నారు.

వోల్వో ఆపరేటర్లకు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

- డ్రైవర్ల పోరాటానికి సీఐటీయూ మద్దతు



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి డివిజన్ పరిధిలోని కేకే ఓబీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు వోల్వో ఆపరేటర్లు సమ్మె చేస్తున్న కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు మధు డిమాండ్ చేశారు. గురువారం సమ్మె చేస్తున్న కార్మికులకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సింగరేణి ఓబిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు వోల్వో ఆపరేటర్లకు సింగరేణి జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టు కార్మికుల శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వోల్వో డ్రైవర్లు అందరికీ హైస్కిల్డ్ వేతనం ఇవ్వాల్సి ఉన్నా స్కిల్డ్ వేతనంతో సరిపెడుతున్నారన్నారు. యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ లని అధికారులే అమలు చేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. వోల్వో ఆపరేటర్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. సమ్మెను విరమించడంలో జోక్యం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ కమిషనర్‌కి, ఆర్ఎల్సి రామగుండంకి కాంట్రాక్టు కార్మికుల సంఘం సీఐటీయూ తరుపున లెటర్ పంపారు. యాజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే పోరాటాన్ని ఉధతం చేసే విధంగా కార్మికులను ఐక్యం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దూలం శ్రీనివాస్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి, దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా మంగమ్మ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐగా సిహెచ్ మంగమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే విధులు నిర్వర్తించిన మంగమ్మను ఉన్నతాధికారులు డిప్యుటేషన్‌పై పంపారు. 2016 నుండి 2018 వరకు మంగమ్మ ఇక్కడే సీఐగా విధులు నిర్వర్తించారు. 2018లో ఆమెను డిప్యుటేషన్‌పై మంచిర్యాలకు పంపించారు. అనంతరం ఇక్కడ ఆరుగురు సీఐలు విధులు నిర్వర్తించినా అందరూ ఇన్‌ఛార్జి బాధ్యతలే చేపట్టారు. నిజామాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగంలో డిప్యుటేషన్‌పై సీఐగా విధులు నిర్వర్తిస్తున్న మంగమ్మను రెగ్యులర్ స్థానమైన కాగజ్‌నగర్‌కే పంపిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌ఛార్జి సీఐగా ఉన్న విలాస్‌ను పదోన్నతిపై నిజామాబాద్ డీటీఎఫ్ సీఐగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మంగమ్మ మాట్లాడుతూ తన రెగ్యులర్ స్థానానికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు తాను విధులు నిర్వర్తిస్తానని అన్నారు.

రెండో పీఆర్‌సీ కమిటీని నియమించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శాంతికుమారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రెండో పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించి ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి పీఆర్‌సీ గడువు జూన్ 30తో ముగిసిందని, జులై 1, 2023 నుండి నూతన పీఆర్‌సీ అమలు కావాల్సి ఉందని అన్నారు. హైకోర్టులో ఉన స్టేను తొలగించి బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా నేటికీ పుస్తకాల పంపిణీ సక్రమంగా జరగలేదని, వెంటనే విద్యార్థులకు సరిపడా పుస్తకాలు పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్‌లను నియమించాలని, పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకుల కో కన్వీనర్ నరేష్, మండల అధ్యక్షులు మహిపాల్, మండల బాధ్యులు నయీమ్, ఆనంద్, స్వాతి పాల్గొన్నారు.

ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

2023-24 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్, ఇందారం ఉపరితల గనులలో ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని డైరెక్టరెక్టర్ ఫైనాన్స్, పా ఎన్ బలరాం, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్, ప్లానింగ్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గురువారం డైరెక్టర్లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఉపరితల గనులలో ఓబి ఎంత ఎక్కువ తీస్తే అంత ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని, కావున ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించడం లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో, ఇందారం ఉపరితల గనిలో ఓబి కాంట్రాక్టు కంపెనీ వారితో మాట్లాడి రక్షణతో కూడిన ఓబీ ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని, ఇందారం ఉపరితల గనిలో రోజువారీ ఓబీ ఎంతవరకు తీస్తున్నారని జనరల్ మేనేజర్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.పురుషోత్తమరెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెట్లే ప్రగతికి మెట్లు



నవతెలంగాణ-బెజ్జూర్

గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎవిన్యూ ప్లాంటేషన్ బెజ్జూర్ నుండి పాపన్నపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా జావిద్‌అలీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగిందని, అందరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి తమవంతు చెట్లపై తమకున్న మక్కువను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ జావిద్, మాలీ సంఘం యువ నాయకులు కావిడి వెంకటేశ్, చటారి శంకర్ పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిని కలిసిన పాల్వాయి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, సిర్పూరు నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అధ్యక్షతన రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా పాల్వాయి హరీష్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గాజుల సంపత్ జ్ఞాపకార్థం కుమారుడు గాజుల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. 60 మంది విద్యార్థులకు రూ.10 వేల విలువ గల నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్ అందించారు. తమ నాన్న గాజుల సంపత్ జ్ఞాపకార్థం పేద, గిరిజన విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు ఇలానే భవిష్యత్‌లో కూడా అందిస్తామని దాత గాజుల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. అనంతరం తమ పాఠశాల విద్యార్థులకు బుక్స్, పెన్స్, పెన్సిల్స్ పంపిణీ చేసిన దాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరాల మహేష్, సిలివేరి వెంకటేష్, ఉపాధ్యాయులు పుష్పలత, జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, మాధవి లత, అనసూర్య, అర్చన పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా అకాడి పండుగ

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసులు మొదటి పండుగ అయిన ఆకాడి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం మాన్యాపూర్ గ్రామంలో ఆదివాసులు ఆకాడి పండుగను నిర్వహించారు. గ్రామంలోని వ్యవసాయ పొలిమెరలో ప్రత్యేకంగా పూజలు చేశారు. వర్షాలు సమృదిగా కురిసి పంటలు బాగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రూపదేవ్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, గ్రామ పెద్దలు మోతిరాం, చందు, సీతారాం, సోము, రామారావ్, భీంరావ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ఉద్యమ సమయంలో న్యాయవాదుల పాత్రను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ప్రశంసించారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. తెలంగాణ శ్రేయస్సు కోసం తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నగేష్, ప్రతాప్‌రెడ్డి, చంద్రకాంత్, నాయకులు ఉన్నారు.

పెండింగ్ మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- పూసం సచిన్ టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాల హాస్టల్స్‌లో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలనీ తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటం ఫలితంగా మెనూ ప్రకారం భోజనం అందటం లేదని తెలిపారు. జీసీసీలో ఎవరు సరుకులు పంపిణీ టెండర్ తీసుకోవడానికి కూడా ముందుకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణాలో విద్యార్థుల మెస్ బిల్లులు స్కాలర్‌షిప్ చెల్లించలేని దుస్థితి ఉంటే పాలకులు సిగ్గుపడాలని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్స్, రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వర్షాకాల నేపథ్యంలో మురికి కాలువల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో మురుగు నీటి నాలాలను గురువారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. నాలాల్లో చెత్త చెదారం, ప్లాస్టిక్ వంటివి అడ్డుగా లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శివాజిచౌక్‌లో ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా బైంసా స్టాప్ స్థల మార్పిడి దృష్ట్యా పరిశీలించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచనలు, సలహాలు స్వీకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్ష కాల నేపథ్యంలో పట్టణ ప్రధాన మురుగు నీటి నాలాల పూడికతీత పనులు చేశామని అన్నారు. మురుగు నీటి, నాలాలు, రోడ్డు సమస్య దృష్ట్యా ఆదర్శనగర్ ప్రాంతంలో పర్యటించి, పరిశీలించారు. త్వరలోనే నూతనంగా నిర్మాణం చేపట్టి శాశ్వతంగా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. చైర్మెన్ వెంట కమిషనర్ సీవీఎన్ రాజు, ఏఈ హరిభూవన్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్స్ ముజాయిద్, అబ్రార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అలరించిన బహుజన కవి సమ్మేళనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలోని బుద్ధవిహార్ ప్రాంగణంలో గురువారం బహుజన కవి సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఏకపాత్రాభినయాన్ని వందన సంభాజీ వాగ్మారే ప్రదర్శించి పూలే దంపతుల జీవిత చరిత్రను కండ్లకు కట్టినట్లు చూపించినట్లు తెలిపారు. రిటైర్డ్ పోలీస్ అధికారి తుకారాం జీవనే తన పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ మహారాష్ట్రలోని కవులను పిలిపించి బహుజన కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడం, కుటుంబ కార్యక్రమానికి సామాజిక పరివర్తన కోసం మార్చి ఇలాంటి కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. అంబేద్కర్ వాదాన్ని బహుజనలంతా అలవర్చుకోవాలని తద్వారా సామాజిక న్యాయాన్ని పొందగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధుబావల్కర్, రిటైర్డ్ ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ సోమాజి గులే, అశోక్ ఢోలే, (నాందేడ్) యూనుస్ అక్బాని, అనిల్ సాడ్వే, గణేష్ మెకానే పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ కంది విత్తనాలు

నవతెలంగాణ-పెంబి

జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా పప్పు దినుసుల సాగును ప్రోత్సహించే ఉద్యేశంతో రైతులకు నాణ్యమైన కంది విత్తనాలను ప్రభుత్వం 100శాతం సబ్సిడీలో ఉచితంగా అందిస్తున్నట్టు ఇటిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలో కంది సాగు చేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు తీసుకోదలచిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పెంబి వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి పొందవచ్చని తెలిపారు.

అభివృద్ధికి అమడ దూరంలో కేఆర్‌కే కాలనీ

- గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం..



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

అభివృద్ధికి అమడ దూరంలో కేఆర్‌కే కాలనీ ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. గురువారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని కేఆర్‌కే కాలనీ నిర్వహించారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ మెనిఫేస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఆర్‌కే కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫమైందని అన్నారు. పేదలకు ఇంకా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కెటాయించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ముబారక్, టౌన్ ప్రెసిడెంట్ గుడిపెల్లి నగేష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అంబకంటి అశోక్, నాందేవ్, కన్య ప్రభాకర్‌రెడ్డి, వసీం, కవిత, గంగమ్మ పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

గిరిజనులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలను అందజేసి మాట్లాడారు. అటవీ హక్కు చట్టం-2005 కింద అర్హులైన ప్రతి ఒక్కరికి పోడు. భూములకు పట్టాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమురం భీం ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, మండల రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించడంతో డిజిటల్ పాస్ పుస్తకాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. మండలంలోని 3800 ఎకరాలు, (734) కుటుంబాలకు అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టాలు పొందిన లబ్దిదారులు పంచాయతీ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, బ్యాంకు ఖాతాల వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నాటి గిరిజనుల కలను అటవీ హక్కు పత్రాల పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందని అన్నారు. గిరిజనుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, వైస్ ఎంపీపీ పఠానీ రాధ, ఎఎంసీ వైస్ చైర్మెన్ దత్తు రామ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ లక్ష్మీ నారాయణ, మండల బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ మాధవ్ రావు, మాజీ ఎఎంసీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డి, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఆయ గ్రామ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన

- సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదు : సీఐటీయూ
- రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్ డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా అదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుండి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నాటి నుండి గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మెమో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. జిఓ నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చివేసి పని భారాన్ని పెంచిందని అన్నారు. కార్మికులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాస్, బొజ్జ ఆశన్న, మండల నాయకులు పోశెట్టి, సల్మాన్, గంగన్న, అడెల్లు, బానయ్య, సంతోష్, జైవంత్, అశోక్ శంకర్, ప్రమోద్, విలాస్, కిషన్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై మాక్‌పోల్ నిర్వహించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గురువారం సమీకృత కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములో ఎఫ్ఎల్‌సీ మొదటి విడత చెకింగ్ పూర్తిచేసిన ఈవీఎంలు, వివిప్యాట్లపై జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అదనపు కలెక్టర్ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జూన్ 22 నుండి జులై 04 వరకు 13 రోజుల పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌ల మొదటి స్థాయి చెకింగ్, మాక్ పోలింగ్ జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులు, ఈసీఐఎల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 918 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్ ల చెకింగ్ చేయడం జరిగిందని, ఈసీఐఎల్ ఇంజనీర్లు 10 మంది, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్న ఉద్యేశంతో ఈవీఎం, వీవీప్యాట్‌లపై మాక్ పోల్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు, మాక్‌పోల్‌పై సందేహాలను నివృత్తి చేశారు. ప్రతీ రోజు ఎన్నికల అధికారి, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో మొదటి చెకింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, తహసీల్దార్లు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంఘాలు సంఘటితం కావాలి



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని స్థానిక రాం మందిరంలో బీసీ అధ్యక్షుడి ఎన్నికను అ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ బీసీ సంఘానికి అందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు గోరె విశాల్, గౌరవ అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శి ఉప్పల్‌వార్ కార్తీక్, ఉపాధ్యక్షులు మద్దుల రాజు, పోతరాజ్ నవీన్ కోశాధికారిగా సంజయ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన బీసీ సంఘం సభ్యులను జిల్లా కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు నేటికీ అనేక కులాలు చాలా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతానికి కమిటీ సభ్యులు సంఘం కొరకు నేటి నుండి కృషి చేయాలని కోరారు. బాధ్యతతో పని చేసి సంఘ అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ అన్ని కులాల సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు ప్రాణకోటికి జీవనాధారం

నవతెలంగాణ-నిర్మల్

మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమని నిర్మల్ మండల ఎంపీపీ కోరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో హరితహారంలో భాగంగా మొక్కలను గురువారం పంపిణీ చేశారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జూనోసిస్ డే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వెటర్నరి ఆస్పత్రిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డేను గురువారం నిర్వహించారు. జూనోసిస్ డేలో బాగంగా శునకాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువుల నుంచి మనుషలకు వ్యాధి సోకకుండా ముందస్తుగానే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంవత్సరానికి రెండు సార్లు టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడి రామారావ్ రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ రూరల్ మండలంలోని నీలాయిపేట్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం తమ కార్యాలయంలో లబ్దిదారులకు ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఇందులో మాజీ సర్పంచ్ విలాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓను కలిసిన మహిళ కమిషన్ సభ్యురాలు



నవతెలంగాణ-ఉట్నూర్

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌ను గురువారం ఐటీడీఏ పీఓ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి మర్యాదపూర్వకంగా కలిశారు. పీఓను సన్మానించి, పుష్పగుచ్చం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సమస్యలపై చర్చించారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత పెన్షన్ సాధనకై అంతిమ పోరాటం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు అందరం సంఘటితంగా పోరాడి పాత పెన్షన్ సాధిద్దామని, దీనికోసం ఇంకా అంతిమ పోరాటం చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా భోజన విరామ సమయంలో నర్సాపూర్ మండలంలోని గొల్లమాడ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బూరుగుపల్లి పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి, సభ్యత్వ నమోదు చేయించారు. రాష్ట్రంలోని ఒక లక్షా డెబ్బై రెండు వేల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ఈ విధానంతో అంధకారమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం చేపట్టిన రథయాత్ర ఈ నెల ఇరవై నాలుగున జిల్లాలో కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని బాధితులందరూ హాజరు కావాలని కోరారు. అభి నహీతో కభీ నహీ నినదాంతో ఉద్యమం చేస్తున్నామని తప్పకుండా ఓపీఎస్ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కొండ ప్రవీణ్, దాసరి రమేష్, రఫీ, రవి, కారం ప్రవీణ్, భీమేష్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-ముధోల్

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గన్నోరాలో రూ.2.50 లక్షల నిధులతో హనుమాన్ ఆలయం, రీడింగ్ రూమ్, రువ్వి గ్రామంలో రూ.12లక్షలతో కోనేరు పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.2.50లక్షల నిధులతో యాదవ సంఘ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. ఐదువందల జనాభా కలిగిన గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రామ్‌రెడ్డి, సర్పంచ్‌లు లాలాబాయి రాజన్న, లావణ్య కిష్టయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ మంత్రివార్ గంగాధర్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గౌతం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసమే రాజ్యాధికారం రావాలి


- బహుజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం
- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్



నవతెలంగాణ-జైనథ్

ఆత్మగౌరవం కోసమే రాజ్యాధికారం రావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలతో కలిసి బహుజన ఆత్మగౌరవ సభ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకు అగ్రకుల పార్టీల నాయకులు రైతుబంధు, ఆసరా, దళిత బంధు, అంటూ పథకాల ఆశ చూపిస్తున్నారని అన్నారు. బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని అన్నారు. ఈనెల 17న ఇచ్చోడ మండల కేంద్రంలో షార్ప్ గార్డెన్‌లో నిర్వహించే బహుజన ఆత్మగౌరవ సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని అన్నారు. ఈసభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు మ్యన సురేష్, మండల అధ్యక్షులు రావుల పోచన్న, బీఎస్పీ ఆదిలాబాద్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సృజన్ పాటిల్, బీఎస్పీ నాయకులు శివ, అశోక్, భూమన్న, దౌలత్, ప్రవీణ్, శుభమ్, దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రక్తదానానికి యువత ముందుకు రావాలని స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ అన్నారు. గురువారం రిమ్స్ బ్లడ్ బ్యాంకులో సొసైటీ ప్రతినిధి మెస్రం వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 10మంది సొసైటీ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో భూరె సురేష్, భాస్కర్, వరుణ్, సాయి, రామకృష్ణ, తుకారాం, విశాల్ పాల్గొన్నారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 07 జులై 2023

పెంపుడు శునకాలకు ఉచిత రేబిస్ టీకాలు

నవతెలంగాణ-మందమర్రి



వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా గురువారం మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో 50 పెంపుడు శునకాలకు ఉచితంగా ఆంటీ రేబిస్ టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎంఏ వసీమ్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ జి రాజు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ జి సంతోష్, శానిటరీ ఇన్స్పెక్టర్ వి శ్యామ్ సుందర్, గోపాలమిత్ర సూపర్వైజర్ ఏ రవి, గోపాల మిత్రులు ఎం.రమేష్, పీ.శ్రీనివాస్, ఎస్.చెన్నయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ ముజఫర్అలీ ఖాన్

నవతెలంగాణ-జన్నారం



కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షుడిగా మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన మహమ్మద్ ముజఫర్అలీ ఖాన్ నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్గౌడ్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియమితులైన ముజఫర్అలీ ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి తేవడానికి శాయశక్తుల పనిచేస్తానని అన్నారు.

ఇదేనా సంస్కారం..?

- చివరి మజిలీకి తప్పని ఇక్కట్లు
- అనువుగా లేని స్థలాల్లో వైకుంఠదామాలు
- దహన సంస్కారాలకు తప్పని అవస్థలు

చివరి మజిలీకి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వం నూతనంగా నిర్మించిన వైకుంఠదామాలు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. అనువుగా లేని స్థలాల్లో నిర్మించడంతో దహన సంస్కారాలకు ఆటంకం ఏర్పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల ద్వారా ప్రతి పల్లెలో వైకుంఠదామాలు నిర్మించింది. ఒక్కో నిర్మాణానికి రూ.10లక్షలు వెచ్చించింది. స్థలాల సేకరణ అనువుగా లేకపోవడంతో స్మశాన వాటికలు దూరంగా నిర్మించారు. గ్రామాలలో ఎవరైనా వ్యక్తులు చనిపోతే వారి దహన సంస్కారాలకు ఉపయోగపడటం లేదు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఎక్కడో చెరువు గట్లపైనో, నీటి కుంటల్లోనో, రోడ్ల పైనో నిర్వహించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎల్లంపల్లి నిర్వాసితులకు స్మశాన వాటికలు అనువుగా లేక అంతిమ సంస్కారాలకు పడుతున్న తిప్పలపై కథనం..



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న నంనూర్ గ్రామస్థులు..(ఫైల్)

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో 311గ్రామ పంచాయతీలు ఉండగా అందులో అన్ని పంచాయతీల్లో వైకుంఠ దామాలు నిర్మాణం జరిగాయని అధికారులు చెబుతున్నారు. గ్రామాలలో వైకుంఠ దామాలు అనువుగా లేక అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు మృతుల కుటుంబీకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీల్లో మాత్రమే ఎవరో దాతల సహాయంతో స్మశాన వాటికల నిర్వాహణ సాగుతున్నప్పటికీ గ్రామాలలో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో మృతదేహాలతో వారి కుటుంబాలు రోడ్డుపై ధర్నాలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. ఇలా దహన సంస్కారాల నిర్వహణకు స్థలాలు కరువై రోడ్ల పైనో, చెరువు గట్లపైనో, నీటి కుంటల్లోనో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంలో కొందరు తమను గెలిపిస్తే ఊరికి స్మశాన వాటికకు స్థలం కొనిస్తానని కూడా వాగ్దానాలు చేశారంటే స్మశాన వాటికల సమస్య ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది.



వేంపల్లి లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠ ధామం

అంతిమ సంస్కారాలకు గోదావరే దిక్కు..

మంచిర్యాల జిల్లాలోని సగం గ్రామాలు గోదావరి పరివాహకంగానే వున్నాయి.జిల్లా సరిహద్దు దండేపల్లి మండలం గూడెం నుండి వేమనపల్లి మండలం వరకు ఎక్కువ గ్రామాల్లో దహన సంస్కారాలు గోదావరి ఒడ్డునే నిర్వహిస్తారు.ఎందుకంటే అక్కడ నీటి వసతి తో పాటు తాత ముత్తాతల నుండి ఆచారం ప్రకారం గోదావరిలో నిర్వహిస్తారు.ప్రభుత్వం వైకుంఠ ధామాల నిర్మాణం కోసం ప్రజాభిప్రాయం సేకరించకుండ హడావుడిగా ఉపయోగం లేని చోట నిర్మాణాలు జరిపారు.గత వారం నంనూర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన కారుకూరి శంకరమ్మ మృతి చెందగా ఆ కాలనిలో స్మశాన వాటిక లేకపోవడంతో అక్కడి నుండి 5కిలోమీటర్ల దూరంలోని ఎల్లంపల్లి బ్యాక్ వాటర్లో వుండే పాత నంనూర్ లో ప్రాజెక్ట్ నీరు ఎండిపోవడంతో అక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.దూరం ఎక్కువ ఉండడం ఎండలో అంత దూరం ప్రయాణించడంతో మృతురాలి కుటుంబీకులు ఇబ్బందులు పడ్డారు.ఇలా గతంలో కూడా ఇబ్బందులు ఏర్పడ్డ సందర్భంలో 5 సంవత్సర క్రితం సంవత్సరాల క్రితం నిర్వాసితులు మృతదేహాలను రోడ్డుపై ఉంచి ధర్నాలు,రాస్తా రోకులు నిర్వహించిన సందర్భంలో అప్పుడు స్పందించిన అధికారులు స్మాశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్మశాన వాటికలు నిర్మించారు. కానీ దానికి సరైన రోడ్డు,ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని నిర్వాసితులు తెలుపుతున్నారు.హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ ప్రజలు దహన సంస్కారాలు గోదావరి ఒడ్డున నిర్వహిస్తారు.కానీ వైకుంఠ ధామం మాత్రం ఊరు వెనుకాల గుట్ట దగ్గర నిర్మించారు.ఇప్పటి వరకు అక్కడ ఒక్కరి ఆఖరి మజిలీ కూడా పూర్తి చేయలేదు.

ఫారెస్ట్ అధికారుల బెదిరింపులు..

ఐదు సంవత్సరాల క్రితం నంనూర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన బుదారపు బసుమక్క అనే వృద్దురాలు మృతి చెందగా కుటుంబసభ్యులు పక్కనే ఉన్న ప్రభుత్వ అటవీ స్థలంలో దహన సంస్కారాలు నిర్వహించారు.విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు అక్కడి వెళ్లి మీరు ఇక్కడ ఎవరిని అడిగి శవాన్ని తగల బెట్టారని,కాలిన బూడిదను ఎత్తి బయట పార పోయాలని,మీ పై కేసులు నమోదు చేస్తామని బెదిరించగా చేసేదేమీ లేక మృతురాలి కుమారులు కాలిన బూడిదను ఎత్తి బయట పారపోశారు.ఇలా ఫారెస్ట్ అధికారుల బెదిరింపులను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోగా త్వరలో మీకు స్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని చెప్పారని,కొత్తగా నిర్మించిన వైకుంఠ దామాలు దహన సంస్కారాలు నిర్వహించే విధంగా లేవని ఇప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్లోనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నామన్నారు నిర్వాసితులు.

ఉపాధి నిధులతో నిర్మాణం..!

ప్రతి గ్రామ పంచాయతీకి వైకుంఠ దామాల నిర్మాణం పేరుతో రాష్ట్ర సర్కార్ పెద్ద ప్రచారమే చేసింది. కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ నిధులు రూ.12.60 లక్షలతో గ్రామాల్లో స్మశాన వాటికలు నిర్మించారు. సర్పంచులు వీటిని నిర్మించాలని హుకుం జారీ చేసింది. ప్రభుత్వ నిధులు సమయానికి రావని కొందరు సర్పంచులు వేరే కాంట్రాక్టర్లకు ఇచ్చారు.వారు నాసిరకం గా నిర్మించారు.ముఖ్యంగా వీటి నిర్మాణం ఊరికి చాలా దూరంగా దహన సంస్కారాలకు అనువుగా లేని ప్రదేశాల్లో స్థలాలు కేటాయించారు.దీంతో 90 శాతం గ్రామాల్లో వీటి వినియోగం లేకుండా పోయింది.కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయిందనే విమర్శలు వస్తున్నాయి.

పోడు సాగుదారులందరికి పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

పోడు భూములు సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం భూపట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కనికారపు అశోక్ కోరారు. గురువారం ఆయన పత్రికా విలేకరులతో, మాట్లాడుతూ పోడు భూములను ఆదివాసీ, గిరిజన రైతులు చాలామంది సాగు చేసుకుంటున్నారని, సర్వే సందర్భంగా వారి పేర్లను ప్రభుత్వం గుర్తించిందన్నారు. కానీ పట్టాల సమయంలో వారి పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రైతులకు కూడా భూపట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కే బుచ్చయ్య, గుఢ రాజన్న పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బీబ్రా గ్రామ పంచాయతీ పరిధిలో గల దేవాజీగూడెం గ్రామం నుండి కాగజ్నగర్కు వెళ్తూ పెద్దవాగు వరద ఉధృతి కారణంగా బుధవారం అందవెల్లి వంతెన సమీపంలో పెద్దవాగు దాటుతూ వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. కాగా అతని ఆచూకీ కోసం బుధవారం సాయంత్రం నుండి గాలింపు చర్యలు చేపట్టగా గురువారం సాయంత్రం కాగజ్నగర్ మండలం నామానగర్ సమీపంలోని పెద్దవాగు మడుగులో మృతదేహం లభ్యమైనట్టు ఈస్గాం ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవాజీగూడెం గ్రామానికి చెందిన విడిదినేని మల్లయ్య(60) పని నిమిత్తం కాగజ్నగర్కు బయలుదేరగా అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెన పైనుండి వరద నీరు పారుతున్న క్రమంలో పెద్దవాగు దాటుతూ గల్లంతైనట్టు పేర్కొన్నారు. కాగా అతని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'నాతోనే నియోజకవర్గ అభివృద్ధి'

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



నవతెలంగాణ-హాజీపూర్

తనతోనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే దివాకర్రావు అన్నారు. గురువారం గుడిపేట్లో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ముఖ్య మంత్రి, జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారు. తన హయాంలోనే మెడికల్ కాలేజీ, గోదావరి బ్రిడ్జి, గూడెం లిఫ్ట్ మంజూరయ్యాయని తెలిపారు. ఎల్లంపల్లి నిర్వాసితులకు మంచి ప్యాకేజీ ఇప్పించానన్నారు. మండలానికి మెడికల్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయం, బీసి గురుకులం ఏర్పాటుకు కషి చేసానన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణ స్థలంలో విద్యుత్ సమస్యపై ఎస్ఈతో మాట్లాడి త్వరగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ముందుగా మండలంలోని దొనబండలో రూ.5లక్షల నిధులతో నిర్మించనున్న యాదవ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమాదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భుమేష్, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనోసెస్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రభుత్వాలు జూనోసెస్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం(టీబీఎస్ఎస్) అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. గురువారం ప్రపంచ జూనోసెస్ డే (జంతువుల నుంచి మానవులకు సంక్రమించు వ్యాధుల రోజు) సందర్భంగా పట్టణంలోని సంఘభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంతు మాంసానికి గిరాకి పెరుగుతోందని, ఇది పర్యావరణానికి ప్రమాదమని తెలిపారు. జంతువుల వధ విచ్చలవిడిగా జరుగుతోందని మానవ తప్పిదాలతో నూతన వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. జంతువుల నుంచి మానవాళికి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న జంతువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రతి జీవి స్వేచ్ఛగా ఆరోగ్యంగా మనుగడ సాగించేలా ప్రభుత్వాలు భద్రత కల్పించాలని కోరారు.

దోబీ ఘాట్ స్థలం కేటాయించాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ధోబి ఘాట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని గురువారం తహసీల్దార్ జ్యోతికి రజక వృత్తిదారుల సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడ్రన్దోబీ ఘాట్ కొరకు స్థలం కేటాయించాలని, బట్టలు పిండే క్రమంలో వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో రజక సంఘంకు మోడ్రన్ దోబీగాట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన ప్రకారమే జీఓ విడుదల చేశారన్నారు. జీఓ ప్రకారం స్థలం కేటాయించి మోడ్రన్ దోబి ఏర్పాటుకై సహకరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తంగళ్ళపల్లి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, మండల అధ్యక్షుడు కొత్తకొండ రామస్వామి, కొండపర్తి బాపు, తంగళ్ళపల్లి సమ్మయ్య పాల్గొన్నారు.

మా భూములను అధికార పార్టీ నాయకుడు కబ్జా చేశారు

- స్థలం వద్దకు వెళితే కారుతో తొక్కి చంపుతానంటు బెదిరిస్తునాడని ఆవేదన
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాపల్లి దళితుల ఆందోళన



నవతెలంగాణ-హాజీపూర్

తమ భూములను అధికార పార్టీ నాయకుడు, ఇటుక బట్టీల యజమానులు కబ్జా చేశారని ఆరోపిస్తూ రాపల్లి గ్రామానికి చెందిన 44 మంది దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపల్లి గ్రామ దళితులు మాట్లాడుతూ 1989లో ప్రభుత్వం గుడిపేట్ శివారులోని సర్వే నంబర్ 294లో 44మందికి 11ఎకరాల భూమి కేటాయించిందని తెలిపారు. అందులో నుండి 7ఎకరాల భూమి మంచిర్యాలకు చెందిన మాజీ కౌన్సిలర్ కారుకూరి చంద్రమౌళి, ఇటుకలబట్టీల యజమానులు బండి నారాయణ, హనుమంత రావు, శ్రీనివాస్లు కలిసి కబ్జా చేశారన్నారు. ఆ భూమి దగ్గరకు వెళ్తే లారీలు, కార్లతో తొక్కి చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై పోలీస్లు, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికి పలు మార్లు కలెక్టర్కు ఫిర్యాదు చేశామని, అధికారులు సర్వేకు వచ్చి మధ్యలోనే ఆపేస్తున్నారని పేర్కొన్నారు. తమకు రావాల్సిన11 ఎకరాల భూమిని చూపించి హద్దు రాళ్ళు వేయించి న్యాయం చేయాలని తహసీల్దార్ రాజలింగంను కోరారు.

డీజిల్ దొంగల బైండోవర్ రూ.లక్ష జరిమానా



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము కుమార్, సాలంగి అరవింద్, ఏంశాలి సంతోష్ అనే ముగ్గురు వ్యక్తులు రాత్రి సమయంలో సింగరాయి పేటలోని జియో టవర్ యొక్క జనరేటర్ రాత్రి తాళాలు పగులగొట్టి అందులోని డీజిల్ దొంగలించడానికి ప్రయత్నించినారని జియో టవర్ టెక్నిషియన్ పంచర్ల తిరుపతి జూన్ 27న జన్నారం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పైన తెలిపిన వారిపై క్రైం నెంబరు 89/2023 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. డీజిల్ దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తులను జన్నారం తహసీల్దార్ వెంకట కిషన్ ముందు హాజరు పరచగా మంచి ప్రవర్తన కలిగి ఉండడానికి ఆరు నెలల కాలానికి రూ.లక్ష బైండోవర్ చేసినట్లు ఎస్సై పి.సతీష్ తెలిపారు.

కదిలిన పంచాయతీ కార్మికుల దండు

- జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన
- ప్రారంభమైన పంచాయతీ కార్మికుల సమ్మె



ఆసిఫాబాద్ :

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్తో పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు జిల్లాలోని కార్మికులు దండులా కదిలి వచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. దేశంలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా రాష్ట్రంలోని పంచాయతీలో నిలుస్తున్నాయని దీనికి కారణం కార్మికులేనన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారిని గుర్తించకపోవడం దారుణం అన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బిల్ కలెక్టర్, కారోబార్లకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పాలిట శాపంగా మారిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి జీఓ నెంబర్ 51ను సవరించాలన్నారు. ఆదివారాలు, పండుగ సెలవులు జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. 11వ పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం కనీస వేతనం రూ.19000 చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరకా శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, జేఏసీ నాయకులు దేవేందర్, గడ్డం వెంకన్న, రాజు, సమ్మయ్య, పుష్పలత, రమ, దుర్గ ప్రసాద్, రమేష్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, శంకర్, దేవరావు పాల్గొన్నారు.

రెబ్బెన : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా రెబ్బెన గ్రామ పంచాయతీ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్కు జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు అలుపెరగని పోరాటం చేశారని, రాష్ట్ర సాధనలో అత్యంత కీలకపాత్ర పోషించారన్నారు. గత 9 సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడికి గురిచేస్తుందన్నారని ఆవేధన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగిన మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని, దీనిని పోస్టాఫీసు బీమా పథకం ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎన్ సుధాకర్, రమేష్, శంకర్, వెంకటేశం, దేవాజీ, లక్ష్మితో పాటు గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



రెబ్బెన :



ఆసిఫాబాద్ :

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్వాతంత్ర పోరాట సమరయోధులు భారతదేశ మొదటి ఉప ప్రధాని బాబు జగ్జీవరాం 38వ వర్ధంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని హడ్కో కాలనీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలో అతి చిన్న వయసులో అనేక పదవులు చేపట్టి హరిత విప్లవాన్ని సృష్టించిన గొప్ప వ్యక్తి జగ్జీవన్రాం అని కొనియాడారు. హోమ్ శాఖ మంత్రిగా పదవి చేపట్టి సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించి దేశ సైనికుల్లో నూతన ఉత్తేజం నింపాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, ఎంఎస్పి నియోజకవర్గ ఇన్ఛార్జి రేగుంట సాగర్, వడ్లూరి రాజు, ఎగురపు సాయి, వడ్లూరి బన్నీ, గణేష్ పాషా, మహిళా నాయకురాలు రేగుంట రాజేశ్వరి, దుర్గం రేణుక, భాగ్య, జయ, స్వప్న, కమల, జ్యోతి, శాంతాబాయి, కవిత, పుష్ప పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు తప్పక ఉద్యోగోన్నతి

నవతెలంగాణ-జన్నారం



ఉత్తమ సేవలు అందించిన వారికి తప్పక ఉద్యోగోన్నతులు లభిస్తాయని మండల జాంబవ సంఘం నాయకులు అన్నారు. జన్నారం పోలీస్స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న భాస్కర్కు హెడ్ కానిస్టేబుల్గా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో గురువారం జాంబవ సంఘం ఆధ్వర్యంలో భాస్కర్ను సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జన్నారం ఉప సర్పంచ్ రవి, ఎంపీటీసీ రియాజుద్దీన్, సంఘం నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆధ్యాత్మికతతో పాటు దైవ కార్యక్రమాల వైపు మక్కువ పెంచుకున్నప్పుడే మానసిక ప్రశాంతతను పెంపొందించుకోగలుగుతామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శాంతి సందేశంతో కూడిన జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సర్వేజనా సుఖినోభవంతు వాక్యాలను శాంతి స్థాపనతోనే నిరూపించగలుగుతామని అన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం వైపు ఆధ్యాత్మికత వైపు దృష్టి సారిస్తూ శాంతి స్థాపనలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, పట్టణ అధ్యక్షులు అజయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, అధికార ప్రతినిధి బైన్వార్ గంగారెడ్డి, రేవంతి బన్, ప్రేమ్‌సింగ్, దేవారెడ్డి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

మిల్లింగ్ పూర్తి చేసి బియ్యాన్ని సరఫరా చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మిల్లింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి సకాలంలో బియ్యం నిల్వలను సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం రాంపూర్‌లోని వినాయక ట్రేడర్స్, సాయి అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులలో వడ్లనిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు త్వరితగతిన మిల్లింగ్ ప్రక్రియను చేపట్టి పౌరసరఫరాల శాఖకు సకాలంలో బియ్యం నిల్వలు అందించాలని సూచించారు. మిల్లింగ్ విధానాన్ని పూర్తిచేసి బియ్యం అందించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఈ పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

గ్రామపంచాయతీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం సమ్మెకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారు. అందులో భాగంగా మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.19వేల 500 చెల్లించాలని అన్నారు. ఇన్సూరెన్స్ రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

దస్తురాబాద్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు గురువారం మండలంలోని కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందర సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం కేటగిరి ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు లింగన్న, మండల అధ్యక్షుడు పోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రామన్న, విజయ, మండల కార్యదర్శి నర్సయ్య సహాయ కార్యదర్శి రాజేందర్, నర్సయ్య, గంగన్న, అంజన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నాయిబ్రాహ్మణుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్పొరేట్ సెలూన్లకు అనుమతి ఇవ్వకుండా తరతరాలుగా వస్తున్న తమ కులవృత్తిని కాపాడాలని నాయిబ్రాహ్మణులు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆదిలాబాద్ పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్పొరేట్ సెలూన్లు వెలిసి తమ కులవృత్తిని దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారయంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, తమ కులవృత్తి దారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కొత్తగా ఏర్పడిన సెలూన్లను రద్దు చేసేవిధంగా ప్రత్యేక చట్టం తీసుకువచ్చి ఉనికిని కాపాడాలని డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-నార్నూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ అన్నారు. గురువారం మండలంలోని బాబేఝరి పంచాయతీ పరిధిలోని ధానుగూడలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలోని 21 మందిని పరీక్షించినట్లు తెలిపారు. అందులో ఇద్దరూ హైరిస్క్ గర్భిణీలకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యం అందించినట్లు పేర్కొన్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో చితగూడ నుంచి 3 కిలో మీటర్లు కాలినడకతో వైద్య సిబ్బంది వెళ్లి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సతవ్వ, వైద్య సిబ్బంది అదీప్, ఈశ్వరి, ఆశ, రూపాబాయి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్, ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాల యువజన కాంగ్రెస్ యూత్ జోడో, బూత్ జోడో కార్యక్రమ ఇన్‌ఛార్జ్ మహారాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా. నిరంజన్ గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అట్టడుగు బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ పనిచేస్తుందని నిరంజన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాయిచరణ్ గౌడ్, ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అర్బత్ ఖాన్, ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బత్తుల మల్లయ్య, తహెర్‌ఖాన్ ఉన్నారు.

బోథ్‌లో అంబేద్కర్ సంఘం సభ్యులు నిరసన

నవతెలంగాణ-బోథ్

ఇటీవల సొనాల గ్రామం మండలంగా ఏర్పడిన సందర్భంగా మండలంలో విజయోత్సవ ర్యాలీ సభలో అంబేద్కర్, శివాజీకి అవమానం జరిగిందని అంబేద్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ అన్నారు. చౌరస్తాలో సభ నిర్వహించడం జరిగిందని ఆ సభకు మాజీ మంత్రి ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ గోడం నగేష్, అనిల్ జాదవ్ హాజరు అయ్యారు. ర్యాలీలో గజమాలతో వారు గౌరవించ బడ్డారు. కానీ అక్కడే ఉన్న ఈ మహనీయులకు కనీసం ఒక దండ వేయకుండా విస్మరించారని అన్నారు. వెంటనే క్షమాపణ కోరాలని లేని యెడల ఉద్యమం ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు కంది ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి రమేష్ బత్తుల, బౌద్ధ మహా సంఘం మండల అధ్యక్షులు అమృత్ పాటిల్, మునేశ్వర్ సోమన్న, మద్దేల మహేష్, జానీ, సంతోష్, రమాకాంత్, ఏరోళ్ల రమేష్, కుర్మే గంగయ్య, కుర్మే ప్రభాకర్, దొంగరి మల్లేష్, బత్తుల ఊశన్న, కాడి కర్ణాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-నార్నూర్

మధ్యాహ్న భోజన వంట కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ఏండీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఝాడే నాందేవ్ అన్నారు. గురువారం ఎమ్మార్వో కార్యాలయంలో ఎంఈఓ రాపెల్లి ఆశన్నకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు ప్రభుత్వం జీఓ నెంబర్ 8/2023ను వెంటనే అమలు చేసి వేతనాలను అందించాలని అన్నారు. వంట సరుకులు, కోడిగుడ్లు, వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం ద్వారా సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మధ్యాహ్న భోజన కార్మికులు తాయబాయి, సునీత, శివబాయి, సులోచన, సంగీత, సార్జా బాయి, రోహిదాస్, విఠల్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

కాంగ్రెస్ పార్టీ పాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తు మాయమాటలతో కాలం వెళ్లదీస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సామాన్‌పెల్లి శేఖర్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, నియోజకవర్గ మైనార్టీ చైర్మెన్ ముస్తఫా, నాయకులు సోమ సురేష్, ఆకుల సుభాష్, రోహిదాస్, మురళి, మడవి సంతోష్ పాల్గొన్నారు.

పోడు భూముల పట్టాలతో

గిరిజన కుటుంబాల్లో ఆనందం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-తాంసి

పోడు పట్టాల పంపిణీతో గిరిజన కుటుంబాల కండ్లలో ఆనందం కనబడుతోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో పాటు ఆర్డీఓ రాథోడ్ రమేష్ హాజరయ్యారు. తలమడుగు-318, తాంసి-12, భీంపూర్-164 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలను అందజేశారు. అదేవిధంగా సవర్గాం, తాంసి, గోమూత్రి గ్రామాల వారికి దళితబస్తీ కింద మంజూరు అయిన భూములకు గాను 51 మందికి రూ.66లక్షల 95వేల 250ల చెక్కులను అందజేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఆదివాసీ గిరిజన బిడ్డలు పోడు భూముల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. గిరిజనులపై అటవీ అధికారులు అక్రమ కేసులు పెట్టడం వారిని చిత్ర హింసలకు గురిచేయడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో పెట్టిన కేసులను ఇప్పుడు తెలంగాణ సీఎం కేసీఆర్ ఆ కేసులను పూర్తిగా తొలగిస్తూ పట్టాలను అందజేసి గిరిజన బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. పోడు భూముల పట్టాలు పొందిన గిరిజనులకు రైతుబంధు రైతు బీమా పథకం అమలులో ఉందన్నారు. అన్ని కులాలను సీఎం కేసీఆర్ రెండు కండ్లతో సమానంగా ఆదరిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టే సత్తా ఏపార్టీకి లేదన్నారు. అనంతరం గిరిజనులతో కలిసి పోడు భూముల పట్టాలు అందజేసి తమకు హక్కు కల్పించినందుకు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన భగత్ మల్లాజీ బార్య గత నాలుగు రోజుల కితం అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్లు వెంకటేష్, నాగయ్య, తారుడి అరుణ్, ఎంపీపీలు మంజుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజు, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ ఎంపీడీఓ భూమయ్య తహసీల్దార్ శ్రీదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని గణేష్ గార్డెన్‌లో గురువారం గిరిజనులకు పోడు భూములకు పట్టాలను ఎమ్మెల్యే జోగు రామన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పక్ష పాతి సీఎం కేసీఆర్ అని, గిరిజనులకు పోడు పట్టాలు అందించడం ద్వారా వారి ఎన్నో ఏండ్ల కల సాకారమైందని అన్నారు. మండలంలో 783 కుటుంబాలకు, 2260 ఎకరాలను అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 60 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్, బీజేపీ నాయకులు అమలుకు నోచుకోని హామీలు ఇస్తున్నారని అన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులకు త్వరలోనే రైతుబంధు కూడా జమ కావడం జరుగుతుందని అన్నారు. మండలంలో ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలులో లేని రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్ వంటి అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, జక్కుల మధుకర్, మంగేష్ ఠాక్రె, బండి సుదర్శన్, ఒళ్ళఫ్‌వార్ దేవన్న, తేజరావ్ మస్కె, పీఏసీఎస్ చైర్మెన్‌లు పారట్కర్ బాల్ చందర్, భేదొడ్కర్ జితేందర్ మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : పోడు రైతుల అభివృద్దే కేసీఆర్ ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురవారం మామడ మండల కేంద్రంలో పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు రైతుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కె.విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, ఎంపీడీఓ శేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని మారుమూల గ్రామాలైన దేవుల నాయక్ తండ, చింతల్ బోరి, పార్డి(కె), పార్డి(బి), వజ్జర్, కేశవ్ గూడ, గ్రామంలోని పోడుభూమి హక్కు పత్రాలను ఎంపీపీ తుల శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి వికాసం కింద బోర్లు వేయించుకొని, మూడు కాలాల పంటలను పండించుకుంటూ ఆదివాసులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. సీఎం కేసీఆర్ మారుమూల గిరిజన ఆదివాసీ రైతులకు ప్రతి ఇంటికి వెళ్లి పోడు పట్టాలను వారి చేతికి అందించి వారి వెన్నంటే ఉండి ప్రోత్సహించాలని సూచించారని అన్నారు. అనంతరం కేశవ్ గూడ గ్రామంలో మండల పరిషత్ నిధుల నుండి రూ.5లక్షలతో అంగన్‌వాడి భవనం నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్‌లు కిషన్, సాకారాం, నాయకులు ప్రశాంత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్‌టౌన్ : గిరిజన రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు అందజేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోడు సాగుదారులకు ఎమ్మెల్యే పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 382 మంది గిరిజన రైతులకు కలిపి 1157 ఎకరాల భూయాజమాన్య హక్కు కల్పించామని తెలిపారు. పోడు గిరిజన రైతుల కల నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు సదరు గిరిజనులు మద్దతుగా నిలువాలని కోరారు. పట్టాలు పొందిన రైతులందరూ రైతుబంధు పథకానికి అర్హుత పొందుతారని తెలిపారు. అలాగే గిరి వికాస్ పథకం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ మోటార్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్సింగ్, ఎంపీటీసీ స్వప్న, ఎంపీడీఓ మల్లేష్, తహసీల్దార్ రాజమోహన్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, సర్పంచులు పార్సెపు శ్రీనివాస్, కడారి గోపాల్, నాయకులు లక్ష్మణ్ రావ్, నంది రామయ్య పాల్గొన్నారు.

పట్టాల కోసం వచ్చి.. ఆకలితో అలమటించి..

పట్టణంలో ఏర్పాటు చేసిన పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన గిరిజనులకు భోజనాలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం 8 గంటలకు రావాలని అధికారులు సూచించడంతో దూరం నుండి వచ్చిన వారు ఆకలితో అలమటించారు. కనీసం ఆల్పాహారం, మధ్యహ్న భోజనం ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు, వారి వెంట వచ్చిన పిల్లలు ఆకలితో అలమటించారు. అసంతృప్తితో వెళ్లిపోయారు.

నేటి నుంచి ఆర్జీయూకేటీ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరు సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమవుతుందని గురువారం డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో 1404 సీట్లకు గాను మొదటిరోజు 500 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, కౌన్సిలింగ్‌లో విద్యార్థితో పాటు తల్లితండ్రులలో ఒకరిని కౌన్సిలింగ్ హాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాల్సి వస్తుందని అన్నారు. ఫీజు చెల్లింపునకు ఎస్బీఐ బ్యాంక్ కౌంటర్‌ను కౌన్సెలింగ్ ఆవరణలోనే ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కౌన్సెలింగ్‌లో సందేహాల నివృత్తి కొరకు హెల్పింగ్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనకై సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం 8 గంటలకు విద్యార్థులు తల్లిదండ్రులకు యూనివర్సిటీలో ప్రవేశం ఉంటుందని తెలిపారు. 9 గంటలకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. సమావేశంలో కోఆర్డినేటర్ చంద్రశేఖర్, కోఆర్డినేటర్ పావని, దత్తు, అడ్మిషన్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, సునీత, కృష్ణ పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

నవతెలంగాణ-తలమడుగు

బడిఈడు, బడిబయట పిల్లలను తప్పకుండా పాఠశాలలలో చేర్పించాలని మహిత ప్రోగ్రామ్ డైరెక్టర్ రమేష్ శేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం బరంపూర్ గ్రామంలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకించి బడిబయట ఉన్న పిల్లలను 100శాతం బడిలో చేర్పించాలనే ఉద్యేశంతో సంస్థ పనిచేస్తుందన్నారు. ఎంఈఓ నారాయణ మాట్లాడుతూ మండలంలో బడిఈడు పిల్లలతో పాటు బడి మానివేసిన పిల్లలను కూడా బడిలో చేర్పించడం గొప్ప విషయమని తెలిపారు. మహిత స్వచ్ఛంద సంస్థతోపాటు ఇతర సంస్థలు కూడా విద్య కోసం కృషి చేయాలని కోరారు. బరంపూర్ గ్రామ యువకులు గ్రామంలో ప్రత్యేకించి లైబ్రరీ భవనాన్ని నిర్మించి బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా బడి మానేసిన వయసు పిల్లలు పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కోసం రాసే విధంగా బుక్స్ ఉంచాలని మహిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాగిర్థా బాయి, గ్రామ పెద్దలు కేదారీశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్ యాదవ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంజిత్ సింగ్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మేనేజర్ శ్రీకాంత్‌రావు, మహిత సిబ్బంది త్రివేణి, అజీమ్, ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏపీఎఫ్ మధు, ఉష, మండల కోఆర్డినేటర్ నూర్జాత్, సాయి కిరణ్ రాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బోస్రా గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులకు వ్యక్తిగత సమాచారం తెలియజేయొద్దని, స్మార్ట్‌ఫోన్‌ను తెలివిగా ఉపయోగిస్తే క్షణాల్లో ఏ సమాచారమైనా అరచేతిలో అందుబాటులో ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతేవేగంగా కష్టాల్లో పడతామన్నారు. ఏ యాప్‌లో ఏముందో పరిశీలించి జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే రైతులకు దొంగ బీటీ గురించి అవగాహన కల్పించారు. యువత చదువుకుంటే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, కానిస్టేబుల్ క్వాలిఫై అయినా వారిని ప్రోత్సహించారు. అనంతరం ఎంపీటీసీ సొంటకే గజానంద్ మాట్లాడుతూ యువకులకు చెడు స్నేహాల కారణంగా యువత చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పే విషయాలను విని, భవిష్యత్తులో సన్మార్గం వైపు పయనించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ముజాహిద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు విసుగు చెంది పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుడిహత్నూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన యువకులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ వచ్చేది ప్రతి పేదవాడు కలలుగన్నటువంటి ఇందిరమ్మ సంక్షేమ రాజ్యమని అన్నారు. ఇందిరమ్మ సంక్షేమ రాజ్యంలో ప్రతి పేదవాడి కండ్లలో చిరునవ్వులే లక్ష్యంగా ప్రజల కనుగుణంగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం వార్డు కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్‌తో కలిసి ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. మొదట రూ.30 లక్షలతో సీసీ రోడ్, డ్రైనేజీ పనులతో పాటు సవారి బంగ్లాల షెడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు హనుమాన్ ఆలయాలకు మరో రూ.10 లక్షలు కేటాయించి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల పట్ల కాలనివాసులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్ చేయించి, అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలో ఇప్పటి వరకు రూ.250కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామని అన్నారు. 68 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహిర్ రంజాని, వార్డు పట్టణ అధ్యక్షులు అజయ్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, స్వరూప రాణి, అన్నెల వసంత్, సూర్య బాన్, సురేఖ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఐటీడీఏ రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వం అందించే గిరిజనులు ఐటీడీఏ రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా సహాయ కలెక్టర్ శ్రీజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐటీడీఏ రుణాలకు సంబంధించి వివరాలను ఐకేపీ ఏపీఎంతో కలిసి బ్యాంక్ కు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిగామ గ్రామంలో రుణాలు పొందిన లబ్ధిదారులను కలిసి ఆర్థిక పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా సహాయక కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన గిరిజన యువకులకు 2021-22 సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పద్దెనిమిది మందికి వివిధ రకాల ఐటీడీఏ సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. లబ్దిపొందిన వారు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. బ్యాంకుల్లో సబ్సిడీ రుణాలు సకాలంలో చెలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీపీఓ ప్రవీణ్, ఏపీఎం.రవీందర్ సిబ్బంది ప్రసాద్ ఉన్నారు.

జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీని జిల్లాలో బలోపేతం చేయడం జరుగుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లామ్ అన్నారు. ఆదిలాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా పలు వార్డులకు నూతన అధ్యక్షులను నియమించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రమైన ముధోల్లోని రబింద్రా ఉన్నత పాఠశాలకు చెందిన సోఫియాన్ అహ్మద్, రామ్‌చరణ్ తేజ్, మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన షేక్ నౌసిన్ అనే విద్యార్థిని, విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇటీవలే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు, విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకు ఎంపిక కావడం పట్ల రబింద్రా ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, చైర్మెన్ భీరాంప్ దేశాయ్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ డి.జ్యోతి అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సైతం ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నెరవేర్చే విధంగా తమ వంతుగా ప్రతి ఒక్కరూ ప్రజాసేవ చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మనోజ్ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లోని దళిత అభివృద్ధి శాఖ కార్యాలయ ఆవరణలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నక్క రాందాస్ నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని మామిడిగూడ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేయాలని గురువారం గ్రామస్తులు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే మంత్రి స్పందిస్తూ త్వరలోనే ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం కాశీరామ్, దేవారి ఆత్రం నాగోరావు, మెస్రం లాలూరామ్, సెడ్మాకి గణపతి, జుగ్నక్ ధర్మ ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న ఉన్నారు.